ఒడిదుడుకుల మధ్య దాళ్వా సాగు

- నెలఖారు నాటికి పూర్తిస్థాయిలో నారుమడులు
- నియోజకవర్గంలో 60 శాతం నారుమళ్లు పూర్తి



కోపల్లె గ్రామంలో సిద్ధంగా ఉన్న నారుమడి



నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన దృశ్యం

కాళ్ల: ఆరుగాలం పండించిన పంట చేతికందే సమయంలో తుపాను హెచ్చరికలతో వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు ఆందోళనలో ఉన్నారు. అయినా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న రైతులు ఒడిదుడుకుల మధ్య దాళ్వా సాగుకు సిద్ధమవుతున్నారు. తుపాను హెచ్చరికలతో ఒకవైపు హడావుడిగా మాసుళ్లు పూర్తి చేస్తూనే మరో పక్కన నారుమడులు వేస్తున్నారు. మండలంలో ఇప్పటికే ఎక్కువ గ్రామాల్లో నారుమళ్లు వేశారు. ఈ నెలాఖారు నాటికి పూర్తిస్థాయిలో నారుమడులు పూర్తి చేయనున్నట్లు రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో నాట్లు వేసేందుకు కూడా దమ్ములు చేసి సిద్ధం చేశారు. మండలంలో ఏలూరుపాడు, దొడ్డనపూడి,కాళ్ళ, సీసలి, జక్కరం, కోపల్లె తదితర గ్రామాల్లో నారుమళ్లు ఇప్పటికే రైతులు పూర్తి చేశారు. ఇప్పటికే మండలంలో 60 శాతం నారుమళ్లు పూర్తయినట్లు అధికారులు చెబ్యున్నారు. ప్రధానంగా కాళ్ల మండలంలో 1121, నూతన వంగడం పీఎల్ 126 రకం వరి వంగడాలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ముందుగా మండలంలో కోపల్లెతో పాటు జక్కరం, దొడ్డనపూడి తదితర గ్రామాల్లో నాట్లు వేయడానికి ఇప్పటికే దమ్ములు చేసి సిద్ధంగా ఉంచారు. నియోజకవర్గంలో కాళ్ల మండలంలో 3822 ఎకరాల్లో 60 శాతం, ఆకివీడు మండలంలో 4500 ఎకరాల్లో 20 శాతం, పాలకోడేరు మండలంలో 11500 ఎకరాల్లో 60 శాతం, ఉండి 10700 ఎకరాల్లో 40 శాతం నారుమళ్లు వేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా నియోజకవర్గంలో కాళ్ల, పాలకోడేరు మండలంలో శుక్రవారం నుంచి నాట్లు వేయనునట్లు తెలుస్తుంది. వాతావరణం అనుకూలిస్తే మాసుళ్లు త్వరితగతిన పూర్తి చేసుకుని నారుమళ్లకు నష్టం లేకుండా గట్టెక్కగలమని రైతులు చెబుతున్నారు. అయితే రోజురోజుకీ అల్పపీడనం వల్ల వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతుల మాత్రం ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

క్రీస్తు జననం మానవాళికి శుభకరం



ప్రార్థనలు చేస్తున్న శ్యామ్ పాల్

ఆకివీడు: క్రీస్తు జననం మానవాళికి శుభకరమని, ప్రపంచ శాంతికి మార్గం చూపిందని జాతీయ క్రిస్టియన్ కౌన్సిల్(ఎన్‌సీసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్ పాల్ చెప్పారు. స్థానిక వివేకానంద కాలనీలోని ఓ గృహంలో గురువారం రాత్రి క్రిస్మస్ కెరోల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నెలంతా ఇంటింటా తిరిగి క్రిస్మస్ కెరోల్స్ నిర్వహించడం, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్రదర్ జయంత్ రావు, డేవిడ్ రాజు, సెబాస్టియన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బాలుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్ఐ రవివర్మ

భీమవరం: నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి గుండె వైద్యానికి ఫిట్‌జోన్ జిమ్ ఆధ్వర్యంలో రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందించి ఉదారతను చాటుకున్నారు. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు ప్రాంతానికి చెందిన గంధం శంకర్ చరణ్ (12)కు గుండె శస్త్రచికిత్స కోసం భీమవరం పట్టణంలోని ఫిట్‌జోన్ జిమ్ అధినేత దాసరి చందు మిత్రులు పాలకోడేరు ఎస్ఐ మంతెన రవివర్మ చేతుల మీదుగా బాలుడు శంకర్‌చరణ్ కుటుంబసభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ నేటి సమాజంలో యువత పేదవారికి సహకారాలు అందజేయడం ద్వారా పేద కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్ ఫిట్‌జోన్ జిమ్ సభ్యులు నాగేంద్ర, రాఖి, భద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నాయకుడికి పీవీఎల్ పరామర్శ



శ్రీనివాసరాజును పరామర్శిస్తున్న పీవీఎల్ నరసింహరాజు

ఆకివీడు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాతపాటి సురపరాజు మృతిపై నియోజకవర్గ కన్వీనర్ పీవీఎల్ నరసింహరాజు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్దాపురం పంచాయతీ ఉప సర్పంచ్ పాతపాటి పద్మావతి, శ్రీనివాసరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురపరాజు మృతి తీరని లోటని పీవీఎల్ అన్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు వేగేసిన వెంకట సూర్యనారాయణ రాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కటారి రామకృష్ణ, కేశవరావు, కె.మోహన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

ఉండి: ఉండి కళింగపేటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.2 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గొల్లలకోడేరులో..

పాలకోడేరు: గొల్లలకోడేరు గ్రామంలో పేకాడుతున్న వారిపై గురువారం దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై ఎం.రవివర్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిందితుల నుంచి రూ.1300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కాళ్ల: కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం కాళ్ల మండలం సీసలి శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామని వివరించారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1,550 నగదు, కోడిపుంజు, కోడికత్తి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఘనంగా హనుమద్ వ్రతాలు

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రతాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది మార్గశిర మాసంలో ఈ ఆలయంలో తొమ్మిది రోజులపాటు ఈ వ్రతాలు చేస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు యేడిద ప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో జరిగే ఈ వ్రతాల్లో రోజుకొక దంపతుల జంట పీటలపై కూర్చొని ఈ వ్రతం నిర్వహిస్తున్నారు.

హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి

కాళ్ల: పార్లమెంట్‌లో ప్రసంగించిన హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడటాన్ని ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు తీవ్రంగా ఖండించారు. మండల కేంద్రమైన కాళ్ళలో అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సోడదాసి గంగయ్య, సోము నాగ కేశవబాబు, కొండా రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరచిన కేంద్రమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి వెంటనే భర్తరఫ్ చేయాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ అన్నారు. గురువారం పాందువ్వలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎం.ప్రశాంత్, ఎం.మణీంద్ర, డి.దుర్గాప్రసాద్, మోహన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాల నిలుపుదల



ఆకివీడు ప్రధాన సెంటర్‌లో రోడ్డు మధ్యలో వాహనాలు నిలిపేసిన దృశ్యం

ఆకివీడు: ఆకివీడులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. జాతీయ రహదారిపై మాదివాడ సెంటర్ నుంచి అయిభీమవరం టర్నింగ్ వరకూ వాహనంపై రావాలంటే అరగంట సమయం పడుతోందని వాహనచోదకులు వాపోతున్నారు. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ నియంత్రించే నాథుడు లేకపోవడంతో ప్రతి అరగంటకూ వాహనాలు నిలిచిపోతున్నాయి. ఆయా దుకాణాల వద్ద, కాఫీ హోటళ్ల వద్ద వాహనాలను రోడ్డుపైనే నిలిపివేసి తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత రద్దీ సమయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. రోడ్డుపై వాహనాలను నిలిపేయడం వల్ల బస్సులు, లారీలు వస్తే ట్రాఫిక్ స్థంభించిపోతుంది. ఈ ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి మరో గంట సమయం పడుతుంది. రోడ్డు మార్జిన్లపైకి వ్యాపారస్తులు తమ వస్తువుల్ని ప్రదర్శన నిమిత్తం ఉంచడంతో, సరుకులు కొనుగోలు చేసే వ్యక్తులు రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. ట్రాఫిక్ నియంత్రించేందుకు గతంలో పోలీసులు రోడ్డుపై ఉండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నారు. ఇటీవల కాలంలో రోడ్డు మార్జిన్లను ఖాళీ చేయించినా అదే పరిస్థితి నెలకొంది. స్థానిక కూరగాయల మార్కెట్ రోడ్డు, ప్రధాన రహదారి, సిద్ధాపురం రోడ్లల్లో ట్రాఫిక్ నిలిచిపోతే, రైలు ప్రయాణం చేసే వారి పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుంది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో తగినంత మంది సిబ్బంది లేకపోవడం వల్లే ట్రాఫిక్ నియంత్రించలేకపోతున్నామని పోలీసులు చెబుతున్నారు. రోడ్డుపై వాహనాలు నిలుపుదల, రోడ్డు మార్జిన్ల ఆక్రమణలపై తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



ఎండీ.జహంగీర్



మన్నే నాగరాజు



గలావెల్లి ధనుంజయ్

ఆకివీడు: పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ మంచి గుర్తింపు లభిస్తుందనడానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ విభాగాల నియామకమే నిదర్శనమని ఆ పార్టీ నేతలు అంటున్నారు. వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులను పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉండి నియోజకవర్గం నుంచి పశ్చిమగోదావరి జిల్లా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రెండవ సారి ఆకివీడుకు చెందిన ఎండీ జహంగీర్, బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా కాళ్ల మండలం బొండాడ గ్రామానికి చెందిన మన్నే నాగరాజు, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉండి గ్రామానికి చెందిన గలావెల్లి ధనుంజయ్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంధన పొదుపుతోనే భవిష్యత్తు

భీమవరం (ప్రకాశంచౌక్): బావి తరాల కోసం ప్రతి పౌరుడు ఇంధనాన్ని పొదుపు చేయాలని ఎలక్ట్రికల్ డీఈ ఎన్ వెంకటేశ్వరరావు, ఏడీఈ కే రాంబాబు, ఇంజనీర్ పద్మశ్రీ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మెప్మ మహిళలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ పొదుపుకు సోలార్ ఎంతో మంచిదని తెలిపారు. విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని, బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులను వాడితే తద్వారా 60 శాతంకుపైగా విద్యుత్ ఆదా చేయవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ అవసరం లేని సమయంలో స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. చెరుకువాడ రంగసాయి, కె.సుధాకర్ రావు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



డీఎన్నార్ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన దృశ్యం

భీమవరం: రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) అన్నారు. డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. తమ కళాశాల తరపున రక్తదాన శిబిరాలను నిర్వహించి తలసలేమియా బాధితులకు అందజేస్తున్నామన్నారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 150 మంది విద్యార్థులు రక్తదానం చేశారని ప్రిన్సిపాల్ ఎం. అంజన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



కోరుకొల్లు రెవెన్యూ సదస్సులో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



బొండాడ రెవిన్యూ సదస్సులో ఫిర్యాదు అందుకుంటున్న తహసీల్దార్

పాలకోడేరు: భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామంలో పంచాయితీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను తీసుకున్నారు. మొత్తం 8 అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి మండలానికి ఒక జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమించామన్నారు. అలాగే గ్రామంలో పంచాయతీ స్థలం ఆక్రమించి నిర్మించిన పక్కా గృహం, ఆక్రమణకు గురైన పంచాయితీ చెరువును సంబంధిత అధికారులతో జేసీ రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఆక్రమణకు సంబంధించిన వారికి నోటీసులు జారీ చేసి రిపోర్టును అందించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.భారతి విజయలక్ష్మి, ఎంపీడీఓ రెడ్డియ్య, మండల సర్వే శ్రీనివాసరావు, మండల వ్యవసాయశాఖ అధికారి వి.నారాయణరావు, డీటీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

బొండాడలో..

కాళ్ల: సమస్యలు పరిష్కరించే విధంగా, అర్హులైన లబ్దిదారులు అందరికీ సంక్షేమ పథకాలను అందజేసేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.సుందర్ సింగ్ అన్నారు. మండలంలోని బొండాడ, బొండాడపేట గ్రామాలకు సంబంధించి గురువారం బొండాడ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుకు ముందు గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సదస్సుల్లో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండు గ్రామాల్లో 9 ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ సుందర్ సింగ్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రవీణ్ వర్మ, ఆర్ఐ లక్ష్మీకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



రాష్ట్ర మంత్రి సుభాష్‌కి వినతి పత్రాన్ని అందజేస్తున్న బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ, జిల్లా అధ్యక్షుడు యుగంధర్

భీమవరం (ప్రకాశంచౌక్): బీసీ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కి జాతీయ బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవానీ యాదవ్, జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. స్కూల్ స్థాయి నుంచి కాలేజీ వరకు విద్యార్థులు మెస్ చార్జీలు పెంచాలని కోరారు. వసతిగృహాల్లో మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. చాలా హాస్టళ్లు అద్దె భవనాలలో నిర్వహించబడుతున్నాయని, సొంత భవనాలు నిర్మాణానికి దృష్టి పెట్టాలని కోరారు. దీనిపై మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు.

కాలుష్య కోరల నుంచి కాపాడాలి



భీమవరంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

భీమవరం: జిల్లా కాలుష్య కోరల్లో చిక్కుకుందని, దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి వాసుదేవ రావు అన్నారు. గురువారం భీమవరంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వం కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పశ్చిమగోదావరి జిల్లా అంటే పచ్చగా ఉంటుందని, కాలుష్యానికి దూరంగా ఉంటుందని, ధనిక జిల్లా అని, సాంప్రదాయాలకు నిలయంగా ఉన్న జిల్లా అని చెప్పుకుంటున్నామని కానీ ఈ కాలంలో క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులకు నిలయంగా మారింది అనేది ప్రభుత్వం గుర్తించాలన్నారు. జిల్లాలో జీవనదులుగా ఉన్న గోస్తని, వెంకయ్య వయ్యేరు, యనమదుర్రు డ్రెయిన్ వంటి ముఖ్యమైన నీటిపారుదల కాలువలు అన్ని కాలుష్య కాసారాలుగా మారిపోయాయని అన్నారు. దీనికి కారణం ఫ్యాక్టరీల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలు, ఆక్వా రంగం విస్తరించిన నేపథ్యంలో కాలువలకు ఉన్న నియమాలను ఉల్లంఘించడం వంటి వాటితో కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయని తెలిపారు. ప్రభుత్వం గతంలో కాలువలపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టి సాగునీటిని అందించడంలో గాని కాలవగట్లు మరమ్మతులు గాని ఇతర ముఖ్యమైన అన్ని అంశాలలోనూ ప్రభుత్వ జోక్యం ఉండేదని ఈ కాలంలో అది కాస్త పోయిందని అన్నారు. తాగునీటిని కొనుక్కుని తాగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీనికి పాలకులు బాధ్యత వహించాలని తక్షణమే కాలుష్యం నుంచి జిల్లాని రక్షించడానికి ప్రణాళిక రూపొందించాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు. జనవరి 3,4,5 తేదీలలో జరిగే జిల్లా మహాసభలలో తీర్మానం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం వైకుంఠ రావు, ఎం ఆంజనేయులు, చల్లబోయిన వెంకటేశ్వర రావు, పతివాడ నాగరాజు, మజ్జి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు గురికాకుండా పనిచేయడం అభినందనీయం



సయ్యద్ పజులుద్దీన్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యుత్ సంస్థలో 32 ఏళ్లపాటు వివాదాలకు గురికాకుండా తన ఉద్యోగాన్ని నిర్వర్తించడం అభినందనీయమని జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. విద్యుత్ సంస్థలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన సయ్యద్ పజులుద్దీన్ అభినందన సభ స్థానిక అంబేడ్కర్ భవనంలో జరిగింది. ఈ సభకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కాం అధ్యక్షుడు జె శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో రోజురోజుకీ పని ఒత్తిడి పెరుగుతుందని ఉద్యోగులు అధికారులు సమన్వయంతో ప్రజలకి అందుబాటులో ఉండి సేవ చేస్తున్నారని అన్నారు. సౌమ్యుడుగా వివాద రహితుడిగా సుదీర్ఘకాలం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సంస్థలో వివిధ హోదాల్లో పని చేయడం అభినందనీయని కొనియాడారు. అనంతరం స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన పజులుద్దీన్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రాంబాబు, అసిస్టెంట్ ఇంజనీర్ లు పి పద్మశ్రీ ,వి ప్రసాద్ రాజు ,ఎం మాధవరాజు, డి. శ్రీనివాసరావు, సీహెచ్ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు: మండలంలోని చినకాపవరం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలుపదల చేస్తామని డీఈఈ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్ స్టేషన్ పరిధిలో చినకాపవరం, పెదకాపవరం, దండగర్ర, గుమ్ములూరు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సరఫరా నిలుపుదల చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆక్వా రైతులు గమనించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం శ్రీరామపురం 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరంలోని రాయలం 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కెవి రాయలం భీమవరం టౌన్ లైన్లు మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలిగించే నిమిత్తం 20వ తేది శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈ.ఈ) ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. బలుసుమూడి, డీఎన్నార్ కాలేజ్ రోడ్, బీసీ కాలనీ, గొల్లవాని తిప్పరోడ్, రామలక్ష్మణ్ నగర్, లెక్చరర్ స్ట్రీట్‌లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులనే వినియోగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కేజీఆర్ఎల్ జూనియర్ కళాశాలల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపార దుకాణాల్లో తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించామన్నారు. ఇకపై ప్లాస్టిక్ వాడకం కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. గంగాధర్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం విడనాడాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించి ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ సంచులనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విప్పర్తి వెంకటరత్నం, గుత్తుల హేమలత, తాడిపత్రి రమ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.